సాక్షి
అనంతపురం
ఆదివారం । 5 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.33 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33 పలికాయి.



టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది.



జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఉదయం పూట చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

13న జరగాల్సిన జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఈ నెల 13న జరగాల్సిన ఎంబీఏ, ఎంసీఏ (రెండో సెమిస్టర్) సప్లిమెంటరీ పరీక్షలు వాయిదా వేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పరీక్షలు వాయిదా వేశామన్నారు. వాయిదా పడ్డ పరీక్షలు ఈ నెల 14న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ అంశాన్ని అన్ని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు గమనించాలని కోరారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్/రాప్తాడు: ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. శనివారం ఆయన రాప్తాడు జెడ్పీ పాఠశాలతో పాటు పోలింగ్ కేంద్రం, కౌంటింగ్ హాల్‌ను పరిశీలించారు. బందోబస్తు చర్యలు, ఏర్పాట్లు, ఎన్నికల నియమ నిబంధనలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎస్పీ వెంట జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ సుజాత, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, వన్‌టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డి, ఇటుకలపల్లి సీఐ మోహన్ ఉన్నారు.

18న స్పెషల్ లోక్ అదాలత్



అనంతపురం: జాతీయ న్యాయసేవాధికార సంస్థ (న్యూఢిల్లీ), ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 18న స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబు తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మూడో శనివారం (18న) ఉదయం 10:30 గంటలకు స్పెషల్ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), వినియోగదారుల ఫోరంలో ఉన్న కేసులు, ఐపీఆర్ కేసులను రాజీ చేయనున్నట్లు తెలిపారు.

వీరింతే.. మారరంతే!

రెవెన్యూ శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. రెవెన్యూ సేవల కోసం వచ్చే వారిని కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ ముప్పుతిప్పలు పెడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న ఫైళ్లను కాదని.. తమకు 'రెవెన్యూ' వచ్చే వాటిపై మాత్రమే దృష్టి సారిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకే ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



- రెవెన్యూ అధికారుల తీరుపై విమర్శలు
- చుక్కల భూముల పరిష్కారంలో జాప్యం
- ఫ్యామిలీ, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల కోసమూ ఎదురుచూపే
- కళ్యాణదుర్గం, కూడేరులో పనుల కోసం తప్పని పడిగాపులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

❐ కూడేరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆఫీసుకు రెండు మూడు రోజులకోసారి వస్తున్నారు. వచ్చినా ఏ ఫైలు మీదా సంతకం చేయరు. రేపు, మర్నాడు అంటూ కాలయాపన చేస్తారు. ఇన్‌కం సర్టిఫికెట్లు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు ఇలా ఏవి జారీ చేయాలన్నా వారాల తరబడి జాప్యం చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

❐ కళ్యాణదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో నెలల తరబడి ఫైళ్ల పరిష్కారం కావడం లేదు. చుక్కల భూముల ఫైళ్ల మరీ జాప్యం చేస్తున్నారు. దీంతో ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈ నెల 3న కళ్యాణదుర్గం ఆర్డీవో స్వయానా కార్యాలయానికి వెళ్లి నిర్లక్ష్యంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

❐ రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్ట మండలం డిప్యూటీ తహసీల్దార్ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలు పనులు జరగకపోవడంతో ఉసూరుమంటూ వెనక్కు వెళ్లాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెవెన్యూ శాఖలో కొందరు అధికారుల పనితీరు అధ్వానంగా ఉంటోంది. విధుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జిల్లాలో ఏ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా పనులు జరగకపోవడంతో బాధితుల వేదన అరణ్య రోదనగా మిగులుతోంది. ఏ ఫైలు చూసినా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారు. ముఖ్యంగా చుక్కల భూముల సమస్యలపై పలువురు రైతులు ఆఫీసుకు వచ్చినా పరిష్కరించకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. కన్వర్షన్, చుక్కల భూముల పరిష్కారానికి డబ్బులిస్తామని ముందుకు వచ్చిన వాళ్లకు మాత్రమే పని చేసి పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 31 తహసీల్దార్ కార్యాలయాలుంటే అన్నింటా ఇదే వరుస. చివరకు ఫ్యామిలీ, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నా నెలల తరబడి జాప్యం జరుగుతోంది. అనంతపురం అర్బన్ లాంటి చోట్ల 7 లక్షల మందికి ఒకే కార్యాలయం ఉంది. ఇక్కడ కూడా పట్టించుకునే దిక్కు లేదు. ఎన్ని ఫిర్యాదులొచ్చినా ఆర్డీఓలు కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. రోజుకు సగటున 50 నుంచి 60 మంది వివిధ పనుల మీద తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పనులు కాక ఇబ్బందులు పడుతున్నా ఆర్డీఓలు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

జిల్లాలోని మండలాలు 31	రెవెన్యూ డివిజన్లు 3
తహసీల్దార్ కార్యాలయాలు 31	తహసీల్దార్ ఆఫీసుకు రోజుకు సగటున వచ్చే జనం 60

మ్యుటేషన్ చెయ్యట్లేదు

మా అమ్మ ఇటీవలే చనిపోయింది. మా నాన్న అంతకుముందే మృతిచెందాడు. నేనొక్కడినే కొడుకును. తల్లి పేరిటపై ఉన్న భూమిని నాపేరుమీద మ్యుటేషన్ చేయాలని గత డిసెంబర్ 20న దరఖాస్తు చేశాను. ఇప్పటివరకూ చెయ్యకుండా కూడేరు తహసీల్దార్ తిప్పుతున్నారు. విధిలేక కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాను.
– జి.హనుమంతరెడ్డి, మరుట్ల, కూడేరు మండలం

ఆర్నెల్లుగా తిరుగుతున్నా కనికరం లేదు

కలుగోడు రెవెన్యూ గ్రామ పరిధిలోని 256 సర్వే నంబర్‌లో నాకు 4 ఎకరాల పొలం ఉంది. దాని కొలత (సర్వే) కోసం చలానా కట్టి ఆరు నెలలుగా గుమ్మఘట్ట తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. నేడు, రేపు అంటూ చెబుతూనే ఉన్నారు. న్యాయం చేయాలని ప్రాధేయపడినా ఫలితం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.
– కె.గోపాల్, రైతు, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

కారణం లేకుండా జాప్యం చేస్తే చర్యలు

చుక్కల భూములు, కన్వర్షన్ ఫైళ్లు వంటి ఎలాంటి ఫైళ్లయినా కారణం లేకుండా జాప్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే వాటికి తహసీల్దార్ కార్యాలయ సిబ్బందే బాధ్యత వహించాలి.
– నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

హనుమద్వాహనంపై చెన్నకేశవుడు



యాడికి: మండల కేంద్రంలోని శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో శనివారం స్వామివారు హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు హరికృష్ణ శర్మ ఉదయం హోమం, స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. మద్దాల సుబ్రహ్మణ్యం, ఈశ్వరయ్య, భాస్కర్, వెంకట శేషఫణి, విశ్వనాథ్ ఆధ్వర్యంలో రాత్రి 10గంటలకు హనుమద్వాహనంపై చెన్నకేశవస్వామిని కొలువుదీర్చి పాత పోలీస్‌స్టేషన్, కోమటి బజార్, పెద్దమ్మ దేవాలయం మీదుగా తిరిగి చెన్నకేశవ స్వామి దేవాలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి, ఉప సర్పంచ్ చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యులు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడురూరల్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ సంగీత కుమారి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం మూడు బాలికలు, రెండు బాలుర పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. బాలికలకు 120 సీట్లు, బాలురకు 120 సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగానే సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. ఈ నెల 6 నుంచి ఏప్రిల్ 4 లోపు https;//mjpapbcwr.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మూడు దశల్లో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 24 టేబుళ్లు
- ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు
- ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం కసరత్తు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 16న జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునతో పోలిస్తే ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు భిన్నంగా ఉంటుంది. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు మూడు దశల్లోగా ఉంటుంది. ఇన్షియల్ కౌంటింగ్ (ప్రాథమిక లెక్కింపు), డిటైల్డ్ కౌంటింగ్ (సమగ్ర లెక్కింపు), ట్రాన్స్‌ఫర్ కౌంటింగ్ (బదిలీ లెక్కింపు) నిర్వహిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు డిటైల్డ్ కౌంటింగ్‌లో ఏ అభ్యర్థికైనా 50 శాతానికి మించి వస్తే ఇక ట్రాన్స్‌ఫర్ కౌంటింగ్ ఉండదు.

కౌంటింగ్ ఇలా...

మొదటి దశ : ఇన్షియల్ కౌంటింగ్‌లో ప్రిసైడింగ్ అధికారి డైరీ ప్రకారం రికార్డు అయిన ఓట్ల సంఖ్య, బ్యాలెట్ పెట్టెలో ఉన్న ఓట్ల సంఖ్యను సరిచూస్తారు. ఆ ఓట్లను లెక్కించి 50 చొప్పున కట్ట కట్టి ఉంచుతారు. ఆ కట్టలను డ్రమ్ములోకి వేసి కలిపేస్తారు.

రెండో దశ : డిటైల్డ్ కౌంటింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థుల వారీగా విభజించి వారికి కేటాయించిన ట్రేలలో ఉంచుతారు. అలా వచ్చిన ఓట్లను లెక్కించి కట్టలుగా (బ్యాలెట్ పేపర్లు) కట్టి ఉంచుతారు.

మూడో దశ: ట్రాన్స్‌ఫర్ కౌంటింగ్‌లో అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత కాకుండా ఆ తరువాతి రెండో ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థులకు బదిలీ చేస్తారు. ఇలా మూడు దశల కౌంటింగ్‌కు వేరువేరుగా లెక్కింపు బృందాలు పనిచేస్తాయి.

టేబుళ్లు... సిబ్బంది కేటాయింపు

పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 24 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఒక్కొక్క టేబుల్‌కు ఒక తహసీల్దార్ లేదా ఎంపీడీఓ స్థాయి అధికారి, ముగ్గురు సపోర్టింగ్ సిబ్బంది, మరో ఇద్దరు సిబ్బంది మొత్తం ఆరుగురు సిబ్బంది ఉంటారు. ఇలా ఒక్కొక్క దశ కౌంటింగ్‌కు ఒక బృందం చొప్పున మూడు దశల కౌంటింగ్‌కు మూడు బృందాలు పనిచేస్తాయి. కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బంది నియామకానికి జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

హంస వాహనంపై వీణాపాణి



కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడోరోజు శనివారం రాత్రి శ్రీవారు హంస వాహనంపై దర్శనమిచ్చారు. చేతిలో వీణ, విశేష దివ్యాభరణాలు, పట్టు పీతాంబరాలు ధరించి తిరువీధుల్లో ఊరేగుతున్న శ్రీవారి దివ్యమంగళరూపం చూసి భక్తులు తరించారు. ఉభయ దారులుగా పట్టణానికి చెందిన తోటంశెట్టి రాజుగోపాల్‌శెట్టి కుటుంబీకులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ తెలిపారు.

నీరిచ్చిన ఘనత మాదే

- జేసీ సోదరులు స్వార్థప్రయోజనాలు చూసుకున్నారు
- పాదయాత్రలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజం



పసలూరులో ప్రజాసంక్షేమ పాదయాత్ర బహిరంగసభకు హాజరైన జనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవప్పూరు: తాడిపత్రి నియోజకవర్గంలో ఆయకట్టుకు పెద్దఎత్తున సాగునీటిని అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేశారు. జేసీ సోదరులు అధికారంలో ఉన్నన్నాళ్లూ స్వార్థ ప్రయోజనాలు చూసుకున్నారు తప్పా రైతులకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఆయన చేపట్టిన ప్రజాసంక్షేమ పాదయాత్ర శనివారం కొట్లాలపల్లిలో ప్రారంభమై పసలూరు, గార్లదిన్నె మీదుగా బొందలదిన్నె వరకు కొనసాగింది. పసలూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా తాడిపత్రికి విచ్చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముచ్చుకోట, చాగల్లు, పెండేకల్లు ప్రాజెక్టులకు నీరిస్తామని హామీ ఇచ్చి.. సీఎంగా పగ్గాలు చేపట్టిన వెంటనే నెరవేర్చారన్నారు. ఫలితంగా ఈ ప్రాంత భూములు సస్యశ్యామలంగా మారాయన్నారు. అదే జేసీ సోదరుల 30 ఏళ్ల పాలనలో ప్రజలకు ఎలాంటి చేయూతా ఇవ్వలేదన్నారు. చివరకు వారి విజయం కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను కూడా పట్టించుకోలేదన్నారు. ఎక్కడైనా ఆలయాల ముందుభాగంలో చెప్పులు ధరించకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తారని, కానీ జేసీ సోదరులు అధికారంలో ఉన్నప్పుడు వారి ఇంటి ముందు బోర్డు ఏర్పాటు చేసి గుళ్ల కట్టడానికి చందాలు, నిరుద్యోగ యువతకు చేయూత, పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సాయం వంటివి నిషేధించినట్లు పేర్కొన్నారని విమర్శించారు. వారిని నమ్ముకుంటే నట్టేట మునగాల్సి వస్తుందని హెచ్చరించారు. బోరుబావుల్లో నీరు అడుగంటిన సందర్భాల్లో చాగల్లు ప్రాజెక్టు నుంచి విడుదల చేయాలని నియోజకవర్గ ప్రజలు గతంలో పలుమార్లు జేసీ సోదరుల దగ్గరకు వెళ్లి అడిగినా పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్టులో ఉన్న నీరు తమకే సరిపోతుందన్న చందంగా వ్యవహరించారన్నారు. వారి వ్యవసాయ భూములకు అవసరమైన సందర్భాల్లో చెంతనే ఉన్న పెన్నానదికి భారీ అడ్డుకట్టవేసి నీటిని తీసుకున్న స్వార్థపరులని ధ్వజమెత్తారు.

క్లుప్తంగా

తల్లీబిడ్డల సంరక్షణే ధ్యేయం



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి దొర

రాప్తాడు: తల్లీబిడ్డల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి దొర అన్నారు. ఆయన శనివారం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని డీఐఓ యుగంధర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణులు ప్రసవమయ్యేలోపు ప్రభుత్వ వైద్యశాలలో తప్పనిసరిగా నాలుగుసార్లు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎంసీసీ కార్డుల్లో నమోదయ్యే వివరాల వల్లే మాతాశిశువుల ఆరోగ్యాన్ని తెలుసుకుని సంరక్షించేందుకు వీలుగా ఉంటుందన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకునేలా చూడాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంగా పక్కాగా అమలు కావాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రావణి, మనోజ్, అంగన్‌వాడీ కార్యకర్త యల్లమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్నకుమారి, ఏఎన్ఎం చంద్రకళ, ఆశా కార్యకర్తలు శివలక్ష్మి, నాగేంద్రమ్మ, వీరమ్మ, లక్ష్మి, అంగన్‌వాడీ సహాయకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్ హాల్‌టికెట్లు వచ్చేశాయ్

రాప్తాడురూరల్: ఇంటర్మీడియెట్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 15 నుంచి జరిగే థియరీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు వచ్చేశాయి. శనివారం ఉదయం ఏడు గంటలకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు జ్ఞానభూమి లాగిన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు ఆర్ఐఓ సురేష్ తెలియజేశారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు వెంటనే అందజేసి, అందులో ఏమైనా పొరబాట్లు జరిగి ఉంటే రెండు రోజుల్లోగా ప్రిన్సిపాళ్ల ద్వారా తనకు ఫిర్యాదు చేస్తే బోర్డు దృష్టికి తీసుకెళ్లి సరిచేయిస్తామని పేర్కొన్నారు. హాల్‌టికెట్ల జారీ సమయంలో ఫీజు చెల్లించాలనే నిబంధన పెట్టి విద్యార్థులకు ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు ఉంటాయని ఆయా కళాశాలల యాజమాన్యాలను హెచ్చరించారు.

ఆర్టీసీ తీర్థయాత్ర

- పుణ్యక్షేత్రాలకు స్పెషల్ బస్సులు
- శ్రావణంలో 'హనుమాన్ దర్శన్'
- ప్రతి పౌర్ణమి రోజున అరుణాచలానికి బస్సు
- తిరుపతి తరహాలో శ్రీశైలానికీ ఆర్టీసీ రిజర్వేషన్
- సరసమైన టికెట్ ధరకే సురక్షిత ప్రయాణం



అనంతపురం సెంట్రల్: తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది. ఇప్పటి వరకూ శ్రావణ మాసంలో ప్రముఖ ఆంజనేయస్వామి క్షేత్రాలైన మురడి, నేమకల్లు, కసాపురం క్షేత్రాలకు ఒకేరోజు భక్తులు దర్శించుకునేందుకు వీలుగా బస్సులు నడుపుతున్న విషయం విదితమే. సదరు మాసంలో నాలుగు శనివారాలు ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది. తాజాగా తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం పుణ్యక్షేత్రం దర్శించుకునే భక్తుల కోసం జిల్లాలోని ఆరు డిపోల నుంచి బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతి పౌర్ణమి రోజున అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేకముంది. జిల్లా నుంచి వేలాదిమంది వెళ్తున్నారు. అయితే కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు భక్తుల వద్ద ఒక్కొక్కరి నుంచి రానుపోను రూ.3,500 నుంచి రూ.5వేల వరకు బస్సు చార్జీ పేరిట నిలువుదోపిడీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ భక్తులకు సరసమైన టికెట్ ధరకే సురక్షిత ప్రయాణం కల్పిస్తోంది. అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఈ నెల 6న ఆర్టీసీ జిల్లాలోని ఐదు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, తాడిపత్రి డిపోల నుంచి సోమవారం సాయంత్రం ఈ స్పెషల్ బస్సులు బయల్దేరుతాయి. టికెట్టు ధర రానుపోను ఒకొక్కరికి రూ.1,450, ఐదేళ్లలోపు పిల్లలకు టికెట్‌లో సగం ధరగా నిర్ణయించారు.

శ్రీశైలానికి రిజర్వేషన్ సౌకర్యం

తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం అనేక సంవత్సరాలుగా ఆర్టీసీ రిజర్వేషన్ సౌకర్యం అందిస్తోంది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ తిరుమలకు వెళ్లే ప్రయాణికులు రూ.300 దర్శన టికెట్‌ను ముందే రిజర్వేషన్ చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తోంది. తాజాగా శ్రీశైలం మల్లన్న దర్శనం చేసుకునే వారికి కూడా ఇదే తరహాలో దర్శన టికెట్ రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. శీఘ్రదర్శనం టికెట్ ధర రూ.150, అతి శీఘ్రదర్శనం టికెట్ ధర రూ.300, స్పర్శ దర్శనం టికెట్ ధర రూ.500 చొప్పున నిర్ణయించారు.

సద్వినియోగం చేసుకోవాలి



పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ సంస్థ సువర్ణ వకాశం కల్పిస్తోంది. తక్కువ మొత్తంతో దైవ దర్శనం చేసుకొని తిరిగి వచ్చేందుకు వీలుగా బస్సులు నడుపుతోంది. తిరుమల తరహాలో శ్రీశైలం దేవస్థానికి కూడా బస్సులు నడపడంతో పాటు దైవ దర్శనం టికెట్‌ను ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చు. అరుణాచలం గిరి ప్రదక్షిణకు జిల్లాలోని ఐదు డిపోల నుంచి ఐదు బస్సులను ఈ నెల ఆరో తేదీన నడుపుతున్నాం. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– సుమంత్ ఆర్.ఆదోని, రీజనల్ మేనేజర్, ఏపీఎస్ ఆర్టీసీ

పరిశోధక విద్యార్థి ఆత్మహత్యాయత్నం



అపస్మారక స్థితిలో ఉన్న ఆంజనేయులు

అనంతపురం: ఎస్కేయూ మేథమేటిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి గుజ్జల ఆంజనేయులు శనివారం ఆత్మహత్యాయత్నం చేశారు. క్యాంపస్‌లోని కృష్ణ హాస్టల్ మేడపై క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో గమనించిన సహ విద్యార్థులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామగిరి మండలం శేషంపల్లికి చెందిన ఆంజనేయులు.. ఆచార్య శోభాలత పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఇటీవల డిగ్రీ లెక్చరర్ పోస్టుకు పోటీ పరీక్ష రాశారు. ఆ పోస్టు దక్కకపోవడంతో మానసికంగా కుంగిపోయినట్లు తెలుస్తోంది. నిబంధనల మేరకు ప్రీ-పీహెచ్‌డీ పరీక్షను ఏటా రెండు దఫాలు నిర్వహిస్తారు. ఇటీవలే పీహెచ్‌డీలో అడ్మిషన్ పొందడంతో ఆ పరీక్ష మళ్లీ రాయాల్సి ఉంటుందని గైడ్ శోభాలత పేర్కొన్నట్లు బంధువులు వెల్లడించారు. దీనికి తోడు రూ.17 వేలు మెస్ బిల్లు చెల్లించేందుకు డబ్బు లేకపోవడం కూడా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు ఆంజనేయులు తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదనే విషయం తెలుసుకున్న వర్సిటీ రెక్టార్ ఎ.మల్లికార్జున రెడ్డి తన వంతు సాయంగా రూ.5వేలు అందజేశారు. ఆస్పత్రిలో ఆంజనేయులుని పరామర్శించి, ఆయన తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ప్రస్తుతం ఆంజనేయులు పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేయనున్నట్లు ఇటుకలపల్లి ఎస్ఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు.

మార్కెట్ కమిటీల్లో ఆదాయం మెరుగుపడాలి



మాట్లాడుతున్న అగ్రికల్చర్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామాంజినేయులు

రాయదుర్గం: వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఆదాయం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను వ్యవసాయ మార్కెట్ కమిటీ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామాంజినేయులు ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, ఏడీఎం సత్యనారాయణతో కలసి శనివారం రాయదుర్గం మార్కెట్ యార్డును ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. యార్డు కార్యదర్శి సునీత, చైర్మన్ భోజరాజ్ నాయక్‌తో సమావేశమై పన్ను వసూళ్ల తీరుపై సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాయలసీమ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలో 74 మార్కెట్ యార్డులు ఉండగా 2022-23వ త్రైమాసికానికి రూ.120.38 కోట్ల పన్ను వసూళ్లు లక్ష్యంగా నిర్దేశించినట్లు వివరించారు. ఇందులో ఇప్పటికే రూ.94.38 కోట్లతో 78 శాతం వసూళ్ల పూర్తయ్యాయన్నారు. మిగిలిన మొత్తం ఈ నెలాఖరులోపు పూర్తి చేసేలా దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కణేకల్లులో అర్ధంతరంగా ఆగిన వ్యవసాయ గోదాము పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం





మృతి చెందిన పోతుల రాజు, షర్మిల (ఫైల్)

ధర్మవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయ సముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన క్రిష్ణమూర్తి కుమారుడు ఎం. పోతులరాజు (25) ధర్మవరంలోని ఓ మార్కెటింగ్ కంపెనీలో ఫీల్డ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. విధుల ముగించుకొని శనివారం రాత్రి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యలో చిగిచెర్ల గ్రామం వద్దకు రాగానే స్పీడు బ్రేకర్ వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కన అంగడి (చిల్లర కొట్టు)ను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న కుల్లాయప్ప, వాణీ దంపతుల రెండో కుమార్తె షర్మిల (4) అనే చిన్నారిని ఢీకొని ఎగిరిపడ్డాడు. పోతుల రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చిన్నారిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా మృతుని భార్య లక్ష్మి ప్రసన్న 9 నెలల గర్భిణి అని తెలిసింది. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

- ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్

రాప్తాడురూరల్: పరిశ్రమల్లో యాజమానులు కార్మికుల భద్రతా ప్రమాణాలను పాటించాలని ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు స్పష్టం చేశారు.శనివారం జాతీయ భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురం రూరల్ రాచానపల్లి పంచాయతీ పరిధిలోని సిప్లాన్ డ్రగ్స్ ఫ్యాక్టరీలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమంతో పాటు వారి ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిప్లాన్ డ్రగ్స్ పరిశ్రమ మేనేజర్ రాజేష్, హెచ్ఆర్ మేనేజర్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఫైనల్‌కు అనంత, వైఎస్సార్ జట్లు

- హోరాహోరీగా సబ్‌జూనియర్ బాలికల హాకీ టోర్నీ



గోల్ కీపర్ మీరాను ఎత్తుకుని సందడి చేస్తున్న అనంతపురం క్రీడాకారిణులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం వేదికగా జరుగుతున్న సబ్ జూనియర్ బాలికల హాకీ పోటీల్లో అనంతపురం, వైఎస్సార్ జిల్లా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. శనివారం నిర్వహించిన సెమీస్‌లో శ్రీకాకుళం, అనంతపురం, వైఎస్సార్, శ్రీసత్యసాయి జిల్లా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. అనంతపురం, శ్రీకాకుళం మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్లు చెరో 3 పాయింట్లు సాధించడంతో ఫలితం డ్రాగా ముగిసింది. అనంత జట్టులో లక్ష్మి, స్వీటి, మంజూష చెరో గోల్ చేయగా, శ్రీకాకుళం జట్టులో తులసి-2 రేవతి-1 గోల్ సాధించారు. దీంతో పెనాల్టీ షూటౌట్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఇక్కడ కూడా చెరో 2 పాయింట్లు సాధించడంతో సడన్ డెత్ విధానంలో అనంత జట్టు 1-0 గోల్ తేడాతో విజయాన్ని సాధించి ఫైనల్‌కు చేరుకుంది. శ్రీకాకుళం జట్టును గోల్ చేయకుండా కట్టడి చేసిన అనంతపురం హాకీ జట్టు గోల్ కీపర్ మీరాను జట్టు సభ్యులు ఎత్తుకుని సందడి చేశారు. రెండో సెమీస్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టుపై 2-1 గోల్స్ తేడాతో వైఎస్సార్ జిల్లా జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. జట్టులో కల్పన కీలక సమయంలో రెండు గోల్స్ చేసి జట్టును విజయతీరాలకు చేర్చింది.

ఇరువర్గాల ఘర్షణ - ఒకరి మృతి



మృతుడు జమ్మన్న

గుత్తి: స్థానిక జంగాల కాలనీలో శనివారం ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బేడ బుడగ జంగమ స్థితిగతులపై విచారణ చేసేందుకు తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఆర్ఐ సందీప్, వీఆర్వో చంద్రకళ, నాగరత్నమ్మ శనివారం సాయంత్రం జంగాల కాలనీకి వెళ్లారు. ఆ సమయంలో తమను బీసీ జాబితాలో చేర్చాలంటూ అధికారులను బేడ బుడగ జంగం ఉపకులస్తులు (బాల సంతు) జమ్మన్న, తాటికొండ కుల్లాయప్ప కోరారు. దీంతో బేడ బుడగ జంగమ కులస్తులు అశ్వ మారెన్న, అవ్వ చిన్న మారెన్న అడ్డుకుని త్వరలో బేడ బుడగ జంగమలను ఎస్సీ జాబితాలో చేరుస్తున్న నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టారని, ఇలాంటి తరుణంలో బాలసంతు కులస్తులమని ఎలా చెబుతారంటూ నిలదీశారు. మాటామాట పెరిగి జమ్మన్న, అశ్వ మారెన్న వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కొడవళ్లు, కట్టెలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన జమ్మన్న వర్గంలో జమ్మనతో పాటు కుల్లాయప్ప, మారెన్న వర్గంలో అశ్వ మారెన్న, చిన్న మారెన్నను కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో జమ్మన్న (60) మృతి చెందాడు. ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఇరు వర్గాలు గుత్తి ఆస్పత్రికి చేరుకోవడంతో కాసేపు ఉద్రిక్తతత నెలకొంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెంకట్రామిరెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

రాప్తాడు: అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసిన 40.85 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎస్ఐ శేషగిరిరావు, సీఎస్‌డీటీ జ్యోతి శనివారం స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు శనివారం రాప్తాడులోని కొండూరు మల్లికార్జున ఇంట్లో తనిఖీలు చేపట్టి బియ్యం నిల్వలు స్వాధీనం చేసుకుని స్టాక్ పాయింట్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా - యువకుడి మృతి

పెద్దవడుగూరు/గుత్తి: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తికి చెందిన నరేంద్ర ఆచారికి ఏడాది క్రితం వివాహమైంది. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అనంతపురానికి బాడుగకు వెళ్లిన నరేంద్ర.. అదే రోజు రాత్రి 7.30 గంటలకు తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తా పడింది. ఘటనలో ఆటో నడుపుతున్న నరేంద్రకు తీవ్రగాయాలయ్యాయి. మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నరేంద్రను అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పెద్ద వడుగూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య



పావని మృతదేహం

యాడికి: మానసిక వేదనతో కుంగిపోయిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి నివాసి నగేష్‌కు 13 ఏళ్ల క్రితం గుంతకల్లుకు చెందిన పావని (33) వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న నగేష్ ఇటీవల కిడ్నీ సమస్యతో బాధపడుతూ పనులకు వెళ్లలేకపోతున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి కుటుంబ పోషణ భారమైంది. దీంతో దిక్కుతోచని స్థితిలో శనివారం ఉదయం కుమారులను పాఠశాలకు పంపిన తర్వాత పావని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గదిలో నుంచి పావని ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో నగేష్ తల్లి వెళ్లి వాకిలి తెరిచి చూడగా అసలు విషయం వెలుగు చూసింది. చుట్టుపక్కల వారి సాయంతో పావనిని కిందకు దించి స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై మృతురాలి తల్లి సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- జీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి



మాట్లాడుతున్న కుష్బూ కొఠారి

తాడిపత్రి టౌన్: వంద శాతం ఉత్తీర్ణతనే లక్ష్యంగా నిర్దేశించుకుని, ఆ దిశగా పాఠ్యాంశాలపై సాధన చేయాలని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి సూచించారు. పరీక్షలకు పదో తరగతి సన్నద్ధం చేసే క్రమంలో గుత్తి, శింగనమల, తాడిపత్రి డివిజన్ల పరిధిలోని బీసీ సంక్షేమ వసతి గృహాల పదో తగతి విద్యార్థులకు తాడిపత్రిలోని సీబీరోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కుష్బూ కొఠారి హాజరై, మాట్లాడారు. ఏకాగ్రతతో పాఠ్యాంశాలను చదవాలన్నారు. పరీక్షల భయం వీడితే విజయం సొంతమవుతుందన్నారు. ఉన్నత శ్రేణి మార్కులు సాధించేలా పాఠ్యాంశాల వారీగా నిపుణులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణుడు క్రియేటర్ కృష్ణ మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏబీసీడబ్ల్యూఓ రంగమ్మ, వార్డెన్లు పాల్గొన్నారు.

రేపు జిల్లా సీనియర్ ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 11న కాకినాడ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను సోమవారం అనంతపురంలోని అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మురళీకృష్ణ శనివారం వెల్లడించారు. మధ్యాహ్నం 1 గంటకు చేపట్టే ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఫెన్సింగ్ కిట్‌తో హాజరు కావాలి.

కోర్టు అటెండర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం: లోక్ అదాలత్ న్యాయస్థానంలో ఖాళీగా ఉన్న అటెండర్ (ఓసీ కేటగిరి) ఉద్యోగాన్ని భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి. శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఔట్ సోర్సింగ్ విధానంలో పోస్టును భర్తీ చేయనున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఏప్రిల్ 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా కోర్టు వెబ్‌సైట్ (https://districts.courts.gov.in/anatapur)లో దరఖాస్తు ఫాంను అందుబాటులో ఉంచారు. గడువు మీరిన తర్వాత అందజేసే దరఖాస్తులను పరిగణలోకి తీసుకోరు.

9 నుంచి దశలవారీ ఉద్యమం

- జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకులు



జేసీ కేతన్‌గార్గ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేఏసీ అమరావతి రాష్ట్ర, జిల్లా నాయకులు

అనంతపురం అర్బన్: డిమాండ్ల సాధనకు ఈ నెల 9వ తేదీ నుంచి దశలవారీగా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు జేఏసీ అమరావతి రాష్ట్ర, జిల్లా నాయకులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జేఏసీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఫణి పేర్రాజు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల చైర్మన్లు దివాకర్ రావు, మైనుద్దీన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు కుల్లాయప్ప, మధునాయక్ తదితరులు కలిసి ఉద్యమ కార్యాచరణ ప్రతిని అందజేసి, మాట్లాడారు. అంతకుముందు కృష్ణకళామందిర్ ఆవరణలోని రెవెన్యూ భవనంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో నాయకులు మాట్లాడారు. డిమాండ్ల సాధనకు తప్పని పరిస్థితుల్లో ఉద్యమానికి సిద్ధమైనట్లు తెలిపారు. జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ ప్రకటించిన కార్యాచరణ మేరకు 9వ తేదీ నుంచి ఉద్యమబాట పడుతున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల ఉద్యోగులు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పరిటాల అనుచరుడికి దేహశుద్ధి

రాప్తాడు రూరల్: అనంతపురం మండలం కురుగుంట సమీపంలోని కాలనీలో వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడిన మాజీమంత్రి పరిటాల సునీత అనుచరుడికి స్థానికులు దేహశుద్ధి చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు... పరిటాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి పంచాయతీ టీడీపీ కన్వీనర్‌గా కొనసాగుతున్నాడు. కనగానపల్లి మండలానికి చెందిన ఓ బీసీ కుటుంబం ఉపాధి కోసం కురుగుంట సమీపంలోని కాలనీకి వలస వచ్చింది. దంపతులిద్దరూ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితిని గమనించిన సదరు టీడీపీ చోటా నాయకుడు డబ్బు సాయం చేస్తూ దగ్గరయ్యాడు. ఈ క్రమంలో వివాహితతో చనువుగా ఉండేదుకు ప్రయత్నిస్తుండడంతో భర్త దేహశుద్ధి చేశాడు. ఈ క్రమంలో బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించేందుకు వెళుతుండగా ఇంతలోనే తన సామాజిక వర్గానికి చెందిన వారిని పెద్ద మనుషులుగా పంపి కేసు పెట్టకుండా బెదిరించారు. పైగా బాధిత కుటుంబాన్ని ఊరు వదిలి వెళ్లాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం.

రేపటి 'స్పందన' రద్దు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన 'స్పందన' కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

యూనిఫాం లేకుండా డ్యూటీకెలా వచ్చారు?

• సచివాలయ ఉద్యోగులపై డీఎల్‌డీఓ ఓబుళమ్మ ఆగ్రహం


ఆదిమూర్తినగర్‌-2 సచివాలయ ఉద్యోగులను నిలదీస్తున్న డీఎల్‌డీఓ ఓబుళమ్మ

అనంతపురం సిటీ: విధులకు వచ్చేటప్పుడు విధిగా యూనిఫాం ధరించాలని పదే పదే చెప్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సచివాలయ ఉద్యోగులపై డీఎల్‌డీఓ ఓబుళమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే ఇంటికిపోతారని హెచ్చరించారు. శనివారం నగరంలోని ఆదిమూర్తినగర్‌-2, బోయగడ్డ వీధి సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లోని ఉద్యోగులు యూనిఫాం లేకుండా సాధారణ దుస్తుల్లో కనిపించడంతో 'మీరు సచివాలయ ఉద్యోగులా? లేక కార్యాలయ పని మీద వచ్చిన వారా? అంటూ ప్రశ్నించారు. విధులకు ఇలానే వస్తారా? ఇలాగైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా' అని అసహనం వ్యక్తం చేశారు. ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్‌ నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఈ–సర్వీసు, ఆయుష్మాన్‌భవ ప్రగతిపై సమీక్షించారు.

17న ఈ వేలం

అనంతపురం సప్తగిరి సర్కిల్‌: జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖలో నిరుపయోగంగా ఉన్న 32 వాహనాలను స్క్రాప్‌ (తుక్కు) కింద విక్రయించేందుకు ఈ వేలం వేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వీరబ్బాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ వేలం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు https://konugolu.ap.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించి, తగిన రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

పూజార్ల అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఓబుళప్ప

ఆత్మకూరు: వాల్మీకి రిజర్వేషన్‌ పూజారుల అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌గా పూజారి ఓబుళప్పను వాల్మీకి రిజర్వేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు బోయ లక్ష్మీనారాయణ ఎంపిక చేసినట్లు పూజారి ఓబుళప్ప శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనను రాయలసీమ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు.

మినర్వాలో 'వైజ్ఞానిక' ప్రదర్శన


నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రాప్తాడురూరల్‌: అశోక్‌నగర్‌లోని మినర్వా ఇంగ్లిష్‌ మీడియం పాఠశాల విద్యార్థులు శనివారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. పిల్లలు తయారు చేసిన ప్రాజెక్టులు, వాటి పనితీరును వివరించారు. రెయిన్‌వాటర్‌ హార్వెస్టింగ్‌, అంధులకు ఉపయోగపడే చేతికర్ర, పొలాల్లోని మోటారును ఇంటినుంచే అదుపులో ఉంచడం, వీధిలైట్లు ఆటోమేటిక్‌గా వెలగడం, గాలిమరలు–విద్యుత్‌ తయారీ, జల విద్యుచ్ఛక్తి తదితర ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్‌ భాస్కర్‌ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో సరస్వతి పూజ


పూజలో పాల్గొన్న ఏజీఎం సుబ్బారెడ్డి

రాప్తాడురూరల్‌: హౌసింగ్‌బోర్డులోని శ్రీ చైతన్య బాలికల పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ చేశారు. ఈ సందర్భంగా చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చివరిగా పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సమీనాఖాన్‌, విశ్వనాథ్‌, ఖలందర్‌, వెంకటేష్‌, తబస్సుమ్‌, శ్రీదేవి, స్వరూప, శాంతా, పర్వీన్‌, నేత్రావతి, అకాడమి కోఆర్డినేటర్లు, వైస్‌ ప్రిన్సిపాల్‌, డీన్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆశీర్వదించండి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


శారద హైస్కూల్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నాయకులు

అనంతపురం క్రైం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని ఆశీర్వదించి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయులు, తదితర ఓటర్లను కోరారు. శనివారం నగరంలోని చర్చిస్కూల్‌, శారద, ఎస్‌కేడీ, పొట్టిశ్రీరాములు, రాజేంద్ర, కస్తూరిబా, నంబర్‌ 2 పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎమ్మెల్యే విస్తృత ప్రచారం చేశారు. పట్టభద్రుల బ్యాలెట్‌ పేపర్‌లో వరుస క్రమంలో మూడో పేరు వెన్నపూస రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయ బ్యాలెట్‌ పేపర్‌లో 11వ పేరు రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చాక సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి, 1,36,000 ఉద్యోగాలు అందించామని, ఆరోగ్యశాఖలో 48,000 ఉద్యోగాలు, ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులకు ప్రభుత్వం తరపున జీతాలిచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ సమస్యను తీర్చాలన్న విజన్‌తో ఇతర రాష్ట్రాలతో పోటీపడేందుకు పెట్టుబడుదారులను ఆకర్షించే విధంగా ఇండస్ట్రీ పాలసీ తీసుకువచ్చారని ఎమ్మెల్యే అన్నారు. విశాఖపట్టణంలో రూ.13 లక్షల కోట్లతో భవిష్యత్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని తెలియజేశారు.

కార్పొరేటర్లకు దిశా నిర్దేశం: ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కార్పొరేటర్లకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దిశా నిర్దేశం చేశారు. నగరపాలక పాఠశాలల్లో ప్రచారం నిర్వహించిన అనంతరం కార్పొరేటర్లకు ఎమ్మెల్యే సూచనలు ఇచ్చారు. ఆయా డివిజన్ల పరిధిలోని ప్రతి ఓటరును ఎమ్మెల్యే కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరాలన్నారు. మేయర్‌ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌ రెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నేత చవ్వా రాజశేఖర్‌ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షుడు సైపుల్లాబేగ్‌ ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, శ్రీదేవి, అనిల్‌కుమార్‌గౌడ్‌, పార్టీ నగర అధ్యక్షుడు సోమశేఖర్‌ రెడ్డి, అధ్యక్షురాలు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

19న శాస్త్రీయ సంగీత పోటీలు

అనంతపురం కల్చరల్‌: అనంత కళా స్రవంతి తరఫున సంగీత పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సరిత రవీంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న స్థానిక గీతామందిరంలో ఉగాది పర్వదినాలను పురస్కరించుకొని జూనియర్స్‌, సీనియర్స్‌ విభాగంలో బాలబాలికలు, పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 17 లోపు తమ వివరాలను 'కృష్ణమూర్తి రాజు, కృపానంద ఆటో స్టాండ్‌ వద్ద, విద్యుత్‌నగర్‌ సర్కిల్‌, అనంతపురం'లో పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్‌: 7032570886లో సంప్రదించాలన్నారు.

ఎఫ్‌సీఐ హమాలీ యూనియన్ అధ్యక్షుడు కన్నుమూత


లారీ ఓబులేసు (ఫైల్‌)

రాప్తాడురూరల్‌: అనంతపురం రూరల్‌ మండలం కందుకూరులోని ఫుడ్‌ కార్పొరేషన్‌ ఇండియా (ఎఫ్‌సీఐ) హమాలీ యూనియన్‌ అధ్యక్షుడు కోగర ఓబులేసు (లారీ ఓబులేసు) గుండెపోటుతో మృతి చెందాడు. జంగాలపల్లి గోదాము ఏర్పడినప్పటి నుంచి లారీ ఓబులేసు హమాలీ యూనియన్‌ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, మండల కన్వీనర్‌ దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్‌ ప్రశాంత్‌కుమార్‌, ఉప సర్పంచ్‌ కేపీ ఓబులేసు, ఎంపీటీసీ సభ్యులు రాగే రేవతిపెద్దప్ప తదితరులు ఓబులేసు మృతదేహానికి నివాళులర్పించారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి


కరపత్రాలు విడుదల చేస్తున్న కార్పొరేషన్ల డైరెక్టర్లు


ప్రచారంలో పాల్గొన్న నాయకులు


ఆత్మకూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్‌: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అధికారులు, ఉద్యోగులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కోరారు. శనివారం కలెక్టర్‌ కార్యాలయం, ఎస్‌బీసీ, మైనారిటీ కార్పొరేషన్‌, ఖజానా, ఫైబర్‌ గ్రిడ్‌, జిల్లా సరఫరాలు, సర్వే భూ రికార్డుల శాఖ కార్యాలయాల్లో ఎమ్మెల్యే అనంత ప్రచారం చేశారు. కలెక్టరేట్‌ ఆవరణలో ఉన్న యూనియన్‌ బ్యాంక్‌, పోస్టాఫీస్‌ సిబ్బందిని కలిసి ఓట్లు అడిగారు. కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ గాయత్రిదేవి, పరిపాలనాధికారి విజయలక్ష్మి, ఏ,బీ,సీ, డీ,ఈ,జీ,హెచ్‌ సెక్షన్లలో అధికారులను ఉద్యోగులను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ సరళ విజయకుమారి, జిల్లా సరఫరాల అధికారి శోభరాణి, ఏఎస్‌ఓ జగన్‌, ఉద్యోగులను, సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ కిశోర్‌బాబు, ఆశాఖ ఉద్యోగులను కలిసి తమ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. మేయర్‌ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, జిల్లా వక్ఫ్‌బోర్డ్‌ చైర్మన్‌ ఖాజజగర్‌ రిజ్వాన్‌, వైఎస్సార్‌సీపీ మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని మీరే నిర్ణయించండి

అనంతపురం క్రైం: త్వరలో జరగబోవు ఎన్నికల్లో మేధావులు, విద్యావంతులు ఆలోచించి ఉత్తముడిని ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని వైఎస్సార్‌సీపీ బీసీ కార్పొరేషన్‌ డైరెక్టర్లు కోరారు. శనివారం వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంగోపాల్‌ రెడ్డి ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో ఎనిమిది క్రిమినల్‌ కేసులున్నట్లు తేలిందన్నారు. ఇతనిపై పలు హత్య కేసులు నమోదయ్యాయన్నారు. ఇలాంటి వ్యక్తికి ఓటు వేసే ముందు మేధావులు ఒక్కసారి ఆలోచించాలన్నారు. వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి న్యాయవాదిగా, గతంలో జెడ్పీ ఫ్లోర్‌ లీడర్‌గా అనుభవం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్‌ డైరెక్టర్లు రమణ (మత్స్య), అల్లీపీరా (దూదేకుల), నాగేంద్ర (ఆర్‌ఏ కటిక), వైఎస్సార్‌ సీపీ నాయకులు అనిల్‌ కుమార్‌గౌడ్‌, నవీన్‌ పాల్గొన్నారు.

రాప్తాడురూరల్‌: పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్‌ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా అనంతపురం రూరల్‌ మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. వెన్నపూస రవీంద్రారెడ్డి సతీమణి హరితతో కలిసి ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్‌, రాప్తాడు మార్కెట్‌ యార్డ్‌ మాజీ చైర్మన్‌ తాటిచర్ల నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ బండి పవన్‌కుమార్‌, జేసీఎస్‌ మండల ఇన్‌చార్జ్‌ మఠం శ్యాందసుందర్‌ తదితరులు సోమలదొడ్డి, పాములాయి, తాటిచెర్ల, ఎస్‌ఎస్‌కుంట, రాచానపల్లి, సిండికేట్‌నగర్‌, ఎన్‌ఆర్‌ కాలనీ, అక్కంపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు.

ఆత్మకూరు: పట్టభద్రుల, ఉపాధ్యాయల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిద్దామని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మధు, వెంకట్రాముడు, బాలపోతన్న, నరసింహారెడ్డి , అతికిరెడ్డి, గోపాల్‌రెడ్డి, విజయ్‌ కుమార్‌, అంజినప్ప, లక్ష్మీనరసింహ, ఓబీ టైలర్‌ వెంకటేష్‌, నాగరాజు, వెంకటేష్‌, మురళి పాల్గొన్నారు.

విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తెలుసుకోండి

• ఉపాధ్యాయులకు డీఈఓ సాయిరాం సూచన


బైజూస్‌ యాప్‌ గురించి విద్యార్థిని అడిగి తెలుసుకుంటున్న డీఈఓ సాయిరాం

ఆత్మకూరు: పదోతరగతి విద్యార్థులకు నెలరోజుల సమయం ఎంతో కీలకమని, రాత్రి 7 గంటల సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రిపరేషన్‌పై వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకోవాలని డీఈఓ సాయిరాం ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్‌, కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను పరిశీలించారు. బైజూస్‌ యాప్‌ ఏ విధంగా ఉపయోగిస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో తెలుసుకున్నారు. అనంతనం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి, స్వయంగా విద్యార్థులకు తినిపించారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కూడేరు: పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యమని జిల్లా విద్యాధికారి సాయిరాం అన్నారు. శనివారం రాత్రి ఆయన మండల కేంద్రం కూడేరులో పదో తరగతి విద్యార్థులు నీలివేణి, దాదా వలి ఇళ్లకు వెళ్లారు. పిల్లలు చదువుకుంటున్నారా? టీవీలు చూస్తున్నారా? అని పిల్లల తల్లిదండ్రులతో ఆరా తీశారు. పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి జవాబులు రాబట్టారు. పాఠశాలలో విద్యాబోధన బాగా చేస్తున్నారా? స్టడీ అవర్స్‌ నిర్వహిస్తున్నారా?అని ఆరా తీశారు. వర్క్‌ బుక్‌, నోట్‌ బుక్స్‌ను పరిశీలించగా అందులో హెచ్‌ఎం, టీచర్లు సరిచూసినట్టు సంతకాలు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎం, టీచర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. టీవీ,సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ రాత్రి 10 గంటల వరకూ, వేకువజామున 4 గంటల నుంచి చదవాలని సూచించారు. అంతకుముందు కమ్మూరు పాఠశాల, కేజీబీవీని సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు.

ఆత్మకూరు: స్థానిక కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులు శనివారం సరస్వతి పూజ చేశారు. అదే సమయంలో డీఈఓ సాయిరాం పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన సరస్వతి పూజలో పాల్గొని, తీర్థప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు.

వేరుశనగ వామికి నిప్పు

కనగానపల్లి: మద్దెలచెరువులో మల్లాల రామాంజనేయులు అనే రైతుకు చెందిన వేరుశనగ వాముకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి నిప్పుపెట్టారు. దీంతో 10 ట్రాక్టర్ల వేరుశనగ కట్టె కాలిపోయింది. దీంతో రూ.5 లక్షల దాకా పంట నష్టం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన రైతు మల్లాల రామాంజనేయులు రబీలో సాగు చేసిన వేరుశనగ పంటను నాలుగు రోజుల క్రితం తొలగించి పొలం వద్దే వాము వేశాడు. రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాయలతో ఉన్న ఎండుకట్టె కాలిబూడిదైంది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితంలేకపోయింది. బాధిత రైతు కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, విచారిస్తున్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

కనగానపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునే వారికి ఓటరు స్లిప్‌లు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్‌ పీవీ రమణ తెలిపారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1,030, ఉపాధ్యాయుల ఓటర్లు ఎమ్మెల్సీ 22 మంది ఉన్నట్లు ఆయన తెలిపారు. స్థానిక గ్రామాల్లోని బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన వేలం పాట


నగరపాలక సంస్థ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం క్రైం: రెండుసార్లు వాయిదా పడిన నగర పాలక సంస్థ పరిధిలోని సంత మార్కెట్‌ వేలంపాట ఎట్టకేలకు ముగిసింది. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌ కే భాగ్యలక్ష్మి అధ్యక్షతన వేలం నిర్వహించారు. సర్కార్‌ సవాల్‌ రూ.75 లక్షలు నిర్ణయిస్తూ వేలంపాట ప్రారంభించారు. ఈ వేలంపాటలో కాంట్రాక్టర్లు విజయ్‌కుమార్‌, కుమార్‌, శ్రీనివాసులు పోటీ పడ్డారు. చివరకు విజయ్‌కుమార్‌ అనే కాంట్రాక్టర్‌ రూ.76,60,000 (రూ.76.60 లక్షలు)కు సంత మార్కెట్‌ను దక్కించుకున్నాడు. ఈ ఏడాది మార్చి 31 అర్ధరాత్రి నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కాంట్రాక్ట్‌ ఉంటుంది. సదరు కాంట్రాక్టర్‌ పాతూరు, కొత్తూరు మార్కెట్‌ తదితర ప్రాంతాల్లో కూరగాయలు, సరుకులు అమ్మకంపై ఫీజు వసూలు చేసే హక్కును దక్కించుకున్నాడు. వేలంపాట రూ.5 వేలు పెంచుతూ వెళ్లారు. అందుకు కమిషనర్‌ భాగ్యలక్ష్మి ఒకసారి రూ.10,000 పెంచుతూ వెళ్లాలని సూచించారు. కాసేపటికి వేలంపాట రూ.76.60 లక్షల వద్ద నిలిచిపోయింది. ఆ సమయంలో కమిషనర్‌ భాగ్యలక్ష్మి కనీసం రౌండ్‌ఫిగర్‌ అయినా చేయండని పాటదారులను వేడుకోవడం చర్చనీయాంశమైంది. చివరకు కాంట్రాక్టర్లు ససేమీరా అనడంతో రూ.76.60 లక్షలకే ముగించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్‌ రమణారెడ్డి, ఆర్‌ఓలు సతీష్‌, సుజాత, ఆర్‌ఐలు వేణు గోపాల్‌, మురళీ, బాబు, పద్మావతి పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేను వేగవంతం చేయాలని కమిషనర్‌ భాగ్యలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ నుంచి ఆమె టెలీ కాన్ఫరెన్స్‌ ద్వారా సచివాలయ పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సెక్షన్‌ హెడ్స్‌కు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్‌ రమణారెడ్డి, ఏసీపీలు శ్రీనివాసులు రెడ్డి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌లో అరుదైన శస్త్ర చికిత్స

• వైఎస్సార్‌ ఆరోగ్య శ్రీ పథకం కింద పూర్తి ఉచితంగా


నారాయణమ్మతో వైద్య బృందం

అనంతపురం సప్తగిరి సర్కిల్‌: మెట్రో నగరాలకే పరిమితమైన అరుదైన శస్త్రచికిత్సను అనంతపురంలోని ప్రభుత్వ సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు చేసి రికార్డు సృష్టించారు. 59 ఏళ్ల వృద్ధురాలికి నూతన జీవితాన్ని అందించారు. వివరాలను సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్య బృందం వెల్లడించింది. ఆయాసం, శ్వాస కోశ వ్యాధితో ఇబ్బంది పడుతున్న శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం మారాళ్ల గ్రామానికి చెందిన నారాయణమ్మను తొలుత కుటుంబసభ్యులు ముదిగుబ్బలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి మెరుగుపడకపోవడంతో అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు వెంటనే ఆమెను సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిలో అడ్మిషన్‌ కల్పించి, డాక్టర్‌ సుభాష్‌ చంద్రబోస్‌ నేతృత్వంలో చికిత్స మొదలుపెట్టారు. పలు రకాల వైద్య పరీక్షలు చేసిన తర్వాత ప్రధాన రక్తనాళంలో రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించి, సూది మందుతో కరిగించేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆమెలో ప్లేటులెట్ల సంఖ్య పూర్తిగా తగ్గిపోయాయి. క్యాథటర్‌ డైరెక్టెడ్‌ థ్రాంబోలైసిస్‌ అనే వినూత్న శస్త్రచికిత్స ద్వారా రక్తనాళంలో ఉన్న గడ్డను కరిగించారు. సాధారణంగా ఇలాంటి శస్త్రచికిత్సలు కేవలం బెంగుళూరు, హైదరాబాద్‌ వంటి నగరాల్లో మాత్రమే చేస్తారు. ఇందుకు రూ. 4 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తారు. ఇంతటి ఖరీదైన శస్త్రచికిత్సను వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందజేశారు. అనంతలో ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్స చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. సమావేశంలో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రఘునందన్‌, సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ సుబ్రహ్మణ్యం, కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ సుభాష్‌ చంద్రబోస్‌, మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శ్రీదేవి, ఆర్‌ఎంఓ వైవీ రావు, వైద్యులు సౌజన్య కుమార్‌, వెంకటరమణ, రాజశేఖర్‌ స్వరూప్‌ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించండి


ముస్లిం శ్మశాన వాటికను పరిశీలిస్తున్న నగర మేయర్‌ వసీం, ముస్లిం మైనార్టీ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్‌: ముస్లింల పవిత్ర రాత్రి నేపథ్యంలో రానున్న షబ్‌ ఏ బరాత్‌ (మంగళవారం)కు ముస్లిం శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్‌ అధికారులను నగర మేయర్‌ వసీం ఆదేశించారు. స్థానిక అశోక్‌ నగర్‌లోని డ్రైవర్స్‌ కాలనీలో ఉన్న ముస్లిం శ్మశాన వాటికను శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అర్ధరాత్రి సమయంలో ప్రత్యేక ప్రార్థనలు, దువాలు, నాత్‌లు ఆచరించేందుకు పెద్ద ఎత్తున ముస్లింలు వస్తారని, ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ కాగజ్‌ఘర్‌ రిజ్వాన్‌, మార్కెట్‌యార్డు చైర్మన్‌ ఫయాజ్‌, వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్‌, కార్పొరేటర్లు అబూసాలెహ, బాబాఫకృద్దీన్‌, రహంతుల్లా, ఇసాక్‌, కోఆప్షన్‌ సభ్యుడు షంషాద్దీన్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, దాదాఖలందర్‌, గఫార్‌, ఏ1 రఫి, రియాజ్‌, కువైట్‌ ఖాదర్‌బాషా, రవి పాల్గొన్నారు.

దిమ్మెలపై నెమ్మదిగా గడ్డర్లను అమర్చారు!


భారీ క్రేన్‌ సహాయంతో గడ్డర్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: రైల్వే ఓవర్‌ బ్రిడ్జ్‌ (ఆర్వోబీ) దిమ్మెలపై గడ్డర్లను భారీ క్రేన్లతో నెమ్మదిగా దించారు. గడ్డర్లను దించుతున్నంతసేపూ నగరవాసులు, యువతీయువకులు, ప్రజాప్రతినిధులు అందరూ ఆసక్తిగా తిలకించారు. గడ్డర్ల ఏర్పాటును తిలకించడానికి యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భారీ క్రేన్‌ ద్వారా చేస్తున్న పనులను సెల్‌ఫోన్లలో సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. పీటీసీ ప్రాంతంలో ఎలాంటి రాకపోకలు లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 4న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఎస్‌ఆర్‌ కన్‌స్ట్రక్షన్స్‌ ఆధ్వర్యంలో ఆర్వోబీపై గడ్డర్ల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. అదే రోజున ఓ బ్రిడ్జ్‌ దిమ్మెపై 700 టన్నుల భారీ క్రేన్‌ సహాయంతో ఐదు గడ్డర్లను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 7 గంటల నుంచే రైల్వే ట్రాక్‌ సమీపంలో ఉన్న గడ్డర్లను ప్రణాళికతో అమర్చారు. పనులను రైల్వే డీఈఎన్‌ వెస్ట్‌ కేడీఎస్‌ కృష్ణ పరిశీలించారు. రైల్వే అధికారులు ఉదయం 10.15 నుంచి 12.45 గంటల వరకు, మధ్యాహ్నం 3.55 నుంచి 5.20 గంటల వరకు అనుమతి ఇవ్వడంతో రెండో బ్రిడ్జ్‌ దిమ్మెపై గడ్డర్ల ఏర్పాటు పనులు ప్రారంభించి, సాయంత్రానికి పూర్తి చేశారు. కాగా అనంతపురం రైల్వే స్టేషన్‌కు వచ్చి వెళ్లే నాలుగు ప్యాసింజర్‌, 24 గూడ్స్‌ రైళ్లతో సహా మొత్తం 28 రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. గడ్డర్ల ఏర్పాటు పనులు ప్రశాంతంగా ముగియడంతో నిర్వాహకులు అవి నాష్‌, హర్షలు రైల్వే సిబ్బంది, కూలీలకు మిఠాయిలు పంచారు. అనంతరం బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. రైల్వే అధికారులు శశాంక్‌, రమేష్‌ రెడ్డి, రమణయ్య, రవిబాబు, ఎస్‌హెచ్‌ అధికారులు గుప్తా, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.